క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్‌గా నిర్మల్ కుమార్ బాధ్యతల స్వీకరణ



అమలాపురం టౌన్: స్థానిక మున్సిపాలిటీ కొత్త కమిషనర్‌గా వి.నిర్మల్ కుమార్ సోమవారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆయన అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అక్కడ నుంచి నేరుగా మున్సిపల్ కార్యాలయానికి వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా పని చేసిన ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో ఈయనకు తాడేపల్లి, బాపట్ల మున్సిపాలిటీల కమిషనర్‌గా పని చేసిన అనుభవం ఉంది. కమిషనర్ నిర్మల్ కుమార్‌కు మున్సిపల్ కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. మున్సిపల్ మేనేజర్ ప్రభాకర్, ఇన్‌చార్జి డీఈఈ కృష్ణ, ఆర్వో భూపతి శ్రీలక్ష్మి, ఏఈలు సూర్య భాస్కరరావు, వెంకటేష్ కమిషనర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా కమిషనర్ విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళతానని చెప్పారు. ముఖ్యంగా పట్టణంలో తాగు నీరు, పారిశుధ్యం, రహదారులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని తెలిపారు. పట్టణ ప్రజలు, అన్ని పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యాలయాల సిబ్బందిని సమన్వయ పరుచుకుని విధులు నిర్వహిస్తానని కమిషనర్ నిర్మల్ కుమార్ స్పష్టం చేశారు.

జగ్గిరెడ్డికి అభినందన



జిల్లా పార్టీ అధ్యక్షుడు జగ్గిరెడ్డిని సత్కరిస్తున్న కిషోర్

ఉప్పలగుప్తం: ఇటీవల వైఎస్సార్ సీపీ బూత్ కమిటీల విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన చీకట్ల కిషోర్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డిని గోపాలపురం ఆయన క్యాంపు కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన నియామకంపై ప్రత్యేక కృషి చేసిన జగ్గిరెడ్డిని దుశ్శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ఉన్న అన్ని గ్రామాల్లో బూత్ కమిటీలను పటిష్టం చేయాలని జగ్గిరెడ్డి ఆయనకు సూచించారని కిషోర్ స్థానిక విలేకరలకు తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గం కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, జిల్లా ఐటీ విభాగం అధ్యక్షుడు తోరం గౌతమ్‌రాజా ఉన్నారు.

సీనియర్ సిటిజన్స్‌తో ఎమ్మెల్యే భేటీ



సీనియర్ సిటిజన్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

యానాం: స్థానిక రీజియన్‌లో వివిధ శాఖల్లో విధులు నిర్వహించిన ఉద్యోగ విరమణ చేసిన పలువురు రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్‌తో సోమవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ ముచ్చటించారు. స్థానిక రాజీవ్ రివర్‌బీచ్ వద్ద వారితో మాట్లాడి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగులు ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే శాఖాపరంగా పరిష్కరిస్తానన్నారు. పలువురు మున్సిపల్ రిటైర్డ్ ఉద్యోగులు తమకు రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ అందలేదని, అదేవిధంగా ఏడో వేతన సంఘం సిఫార్సులు అమలు గురించి ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులతో చర్చిస్తానని హామీ ఇచ్చారు.

వీరేశ్వర అన్నదాన ట్రస్ట్‌కు విరాళం



దాతను సత్కరిస్తున్న ఆలయ సిబ్బంది

ఐ.పోలవరం: నిత్య కల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు సికింద్రాబాద్‌కు చెందిన గుంట షణ్ముఖరావు దంపతులు రూ.11 వేలు విరాళంగా అందించారు. ఆలయంలో సోమవారం స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆలయ సిబ్బందికి ఆయన విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాతకు స్వామి వారి చిత్రపటం, శేష వస్త్రం, ప్రసాదం అందించి సత్కరించారు. ఆలయ సహాయ కమిషనర్, ఈవో వి.సత్యనారాయణ దాతను అభినందించారు.

ఘనంగా మహాలక్ష్మమ్మ జాతర

యానాం: స్థానికంగా కొలువైన శ్రీమహాలక్ష్మమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి పెద్ద జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. గరగన్నృత్యాలు, తీన్‌మార్, బాణసంచా కాల్పుల మధ్య జాతర జరిగింది. ఈ నెల 3వ తేదీ నుంచి 17 వరకూ జాతర మహోత్సవాలు జరుగుతున్నాయి. మంగళవారం మహాలక్ష్మమ్మ తీర్థ మహోత్సవం జరగనుంది.

ప్రజల కష్టాలు

- 14 గ్రామాల్లో తాగునీటికి కటకట
- బోడసకుర్రు ఆర్‌డబ్ల్యూఎస్ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో అడుగంటిన నీరు
- నాలుగు రోజులైనా పంపిణీ కాని జలాలు
- చేతులెత్తేసిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు



అడుగంటిన బోడసకుర్రు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్



ట్యాంకర్ల ద్వారా వచ్చిన తాగునీటిని పట్టుకుంటున్న మహిళలు

అల్లవరం: శుద్ధమైన తాగునీటిని పూర్తి స్థాయిలో ఇంటింటికి పంపిణీ చేస్తామన్న ప్రజాప్రతినిధులు, అధికారుల హామీలు నీటి మాటలయ్యాయి. శుద్ధమైన నీరు కాదు కనీసం గొంతె తడుపుకోవడానికి గుక్కెడు నీళ్లు ఇస్తే చాలు అన్నట్టుగా ఉంది బోడసకుర్రు ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు పరిధిలోని 14 గ్రామాల ప్రజల పరిస్థితి. నాలుగు రోజులుగా తాగునీరు అందక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

ట్యాంక్ పూడుకుపోయి..

బోడసకుర్రు ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు పరిధి ద్వారా 53 ప్రాంతాలకు తాగునీరు అందిస్తున్నారు. ర్యాపిడ్ శ్యాండ్ ఫిల్టర్ ద్వారా నీటిని శుద్ధి చేసి నిర్దేశించిన గ్రామాలకు సమయానుకూలంగా నీటిని ఓహెచ్‌ఆర్‌లకు పంపింగ్ చేసి ఆయా గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే బోడసకుర్రు ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టులో నీరు అడుగంటింది. దీనికి ప్రధాన కారణం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో నీరు లేకపోవడం వల్ల నీటి ఎద్దడిని ఎదుర్కోవాల్సి వస్తోంది. దశాబ్ద కాలం క్రితం నిర్మించిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో భారీగా పూడిక పేరుకుపోవడంతో నీటిని నిల్వ చేసే సామర్థ్యం బాగా తగ్గిపోయింది. దీంతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో నీరు అడుగట్టి తాగునీటి పంపిణీకి తీవ్ర ఆటంకం ఏర్పడింది. దీంతో పాటు కాలువలకు సాగునీరు విడుదల చేయకపోవడం కూడా తాగునీటి పంపిణీకి ఇబ్బందిగా మారింది.

గతంలో ఇబ్బంది లేదు

గత ప్రభుత్వం హయాంలో మే 31 నాటికి కాలువలకు సాగునీరు విడుదల చేసి వ్యవసాయానికి, ప్రజల తాగునీటికి ఏలాంటి ఇబ్బంది లేకుండా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో నిబద్ధతతో పాలన అందించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే తాగునీరు అందించలేని పరిస్థితి ఎదురైంది. ప్రధాన కాలువలపై వంతెనల నిర్మాణాలతో కాలువలకు అడ్డుకట్టలు వేసి సాగునీటిని అడ్డుకుంటున్నారు. దీంతో బోడసకుర్రు ఆర్‌డబ్ల్యూఎస్, గుండెపూడి, కొమరగిరిపట్నం ప్రాజెక్టులకు నీరు వచ్చే పరిస్థితి లేదు.

బోడసకుర్రు ప్రాజెక్టులో గత పది రోజులుగా తీవ్రమైన తాగునీటి ఎద్దడి ఉన్నా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చేతులేత్తేశారు. బోడసకుర్రులో బోర్ బావి నుంచి నీటిని ట్యాంకర్ల ద్వారా సంప్‌లోకి నింపి ఆపై ఓహెచ్‌ఆర్‌లకు పంపింగ్ చేస్తున్నారు. అదీ కూడా అరకొరగా మూడు లేదా నాలుగు రోజులకు కొకసారి మాత్రమే. బోడసకుర్రు ప్రాజెక్టులో నీటి ఎద్దడి తలెత్తడంతో బోడసకుర్రుతో పాటుగా, కోడూరుపాడు, గూడాల, తాడికోన, గోడి, గోడి తిప్ప, గోడిలంక, ఓడలరేవు, మొగళ్ళమూరు, రెల్లుగడ్డ, అల్లవరం, ఎంట్రుకోన, బెండమూర్లంక గ్రామాల్లోని ప్రజలు ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోంది. ఇది పంచాయతీలకు అదనపు భారంగా మారింది.

ఎవరూ పట్టించుకోకపోవడంతో..

ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టులో ఏడాది కాలంలో నిర్వహణంతా కాంట్రాక్టర్‌కు అప్పగిస్తారు. అయితే సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో నీరు లేకపోవడంతో సదరు కాంట్రాక్టర్ నా బాధ్యత కాదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. దీనిపై అధికారులు కూడా నిర్లక్ష్యంగా ఉన్నారు. కాలువలకు సాగునీరు విడుదల చేసేంత వరకు తాగునీటి ఎద్దడిని భరించకతప్పదు.

> **ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నాం**
>
> 
>
> బోడసకుర్రు ప్రాజెక్టు నుంచి వచ్చే తాగునీరు పూర్తి స్థాయిలో సరఫరా కాకపోవడంతో సొంత నిధులతో ట్యాంకర్‌ని సమకూర్చి గ్రామంలోని ప్రజలందరికి తాగునీటిని సరఫరా చేస్తున్నాం. గత నాలుగేళ్లుగా నీటి ఎద్దడి ఉన్న ఏరియాల్లో క్రమం తప్పకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నాం.
>
> – రాయుడు విష్ణు, సర్పంచ్, మొగళ్ళమూరు

సెంట్రల్ వర్సిటీలో 25 శాతం రాయితీ అమలు చేయాలి

యానాం: పుదుచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీలో వివిధ కోర్సుల్లో అడ్మిషన్లలో యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి రీజియన్‌లకు 25 శాతం రాయితీ అమలు చేయాలని సోమవారం సీఎం రంగసామి ఉప రాష్ట్రపతి జగదీప్ దన్‌కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుదుచ్చేరి నివాసితులకు సెంట్రల్ యూనివర్సిటీలో అన్ని కోర్సుల్లో 25 శాతం సీట్లు కేటాయించాలని 2013–14 అకడమిక్ కౌన్సిల్ నిర్ణయించిందని గుర్తు చేశారు. ఇదే డిమాండ్‌ను 1990లో తాము లేవనెత్తినప్పుడు అప్పటి వైస్‌చాన్సలర్ జ్ఞానం విశ్వవిద్యాలయ విద్యామండలిలో తగిన పరిశీలన తర్వాత 25 శాతం సీట్ల రిజర్వేషన్లను 8 కోర్సులకు పొడిగించారన్నారు. అయితే అవి 18 కోర్సులకు పెరిగిందన్నారు. అయితే విశ్వవిద్యాలయంలో వృత్తిపరమైన, ప్రతిష్టాత్మక, ఉద్యోగ ఆధారిత 64 వినూత్నకోర్సులు ప్రారంభించినప్పటికి వాటిలో రిజర్వేషన్లు కల్పించ లేదన్నారు. దీంతో పుదుచ్చేరి యువతలో అసంతృప్తి చోటుచేసుకుందని వినతిపత్రంలో పేర్కొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి



పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న డీఈవో బాషా

అమలాపురం టౌన్: మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని డీఈవో డాక్టర్ షేక్ సలీమ్ బాషా సూచించారు. పట్టణంలోని కొంకాపల్లి జవహర్ లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా భోజనం నాణ్యత, రుచికరంతో పాటు పరిశుభ్రమైన వాతావరణంలో వంటకాలు వండాలని పాఠశాలలో ఆ పథకాన్ని నిర్వహిస్తున్న ఏజెన్సీ ప్రతినిధులకు సూచించారు. సన్న బియ్యంతో కూడిన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. పాఠశాలలో మధ్యాన్న భోజనాన్ని తయారు చేసే వంట గదిని కూడా డీఈవో బాషా తనిఖీ చేసి పలు ఆహార పదార్థాలను కొద్దిగా తిని రుచి చూశారు. పాఠశాలలో విద్యా బోధనకు ఎంతటి ప్రాధాన్యత ఇస్తున్నారో మధ్యాన్న భోజనం నిర్వహణకు కూడా అంతే ప్రాధాన్యత ఇచ్చి నిరంతరం అప్రమత్తతతో పరిశీలించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీతామహాలక్ష్మికి డీఈవో సూచించారు.

బీవీసీలో విద్యార్థులకు శిక్షణ

అల్లవరం: జేఎన్‌టీయూకే, బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో అధునాతన ఇంజినీరింగ్‌రే సంబంధించి పరికరాల తయారీ, విశ్లేషణ అనువర్తనాల్లో ఉపయోగించే సాంకేతికత, ట్రైబోలాజికల్ ప్రవర్తనను అంచనా వేయడం అనే అంశంపై ఐదు రోజుల పాటు విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఓడలరేవులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ రవికుమార్ ముఖ్యఅతిథిగా హాజరై 50 మంది అధ్యాపకులకు ఇంజినీరింగ్ మెటీరియల్స్ విభాగంలో నూతన సాంకేతికతను వివరించారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ కళాపాల ప్రసాద్, బీవీసీ అధ్యాపకులు నవీన్ శ్రీనివాస్, బీవీసీ సభ్యురాలు బోనం కనకదుర్గ, ప్రిన్సిపాల్ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరంతర యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

డీఎస్పీ ప్రసాద్



యోగాసానాల సాధన చేస్తున్న డీఎస్పీ ప్రసాద్, వాకర్స్

అమలాపురం టౌన్: నిరంతర యోగా సాధనతో నిండైన ఆరోగ్యం సాకారమవుతుందని అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ అన్నారు. స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాల క్రీడా మైదానంలో సోమవారం ఉదయం నిర్వహించిన కోనసీమ వాకర్స్ యోగా కార్యక్రమానికి డీఎస్పీ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అమలాపురం స్వామి వివేకానంద యోగాశ్రమ గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ యోగా శిక్షణ కార్యక్రమాన్ని డీఎస్పీ ప్రసాద్ ప్రారంభించారు. వాకర్స్ పాల్గొని యోగా సాధన చేశారు. ఇప్పుడు తాను నేర్పుతున్న యోగాసానాలను ఇంటి వద్ద నిత్యం ఉదయాన్నే చేస్తే మంచి ఆరోగ్యం లభిస్తుందని యోగా గురువు డాక్టర్ శ్రీనివాస్ సూచించారు. వాకర్స్ ప్రతినిధులు జవ్వాది తాతబాబు, గొవ్వాల రాజేష్ (మున్సిపల్ కౌన్సిలర్), నడింపల్లి సూరిబాబురాజు, పొన్నాడ కుమార్, టీవీఎస్ శర్మ, తోట రాము, నూకల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ కవితలకు బహుమతులు

కిచెన్, రూఫ్‌టాప్, ఆర్నమెంటల్ గార్డెన్ పోటీల నిర్వహణ



మార్ని జానకిరామ చౌదరికి బహుమతి అందించి సత్కరిస్తున్న నిర్వాహకులు

యానాం: ప్రపంచ పర్యావరణ పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా యానాం అగ్రి హార్టీకల్చర్ సొసైటీ(వైఏహెచ్ఎస్)ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన పర్యావరణ పరిరక్షణ కవితల పోటీల్లో విజేతలకు సోమవారం పల్లిపాలెం ఆంధ్రీకుటీరం, రత్నప్రభా గ్రంథాలయం వద్ద వైఏహెచ్ఎస్ కార్యదర్శి, రిటైర్డ్ వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ కామిశెట్టి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. ఈ కవితల పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి సుమారు 100 వరకు కవితలు తమకు అందాయన్నారు. వాటిలో ఉత్తమమైన వాటిని ప్రముఖ కవి మధునాపంతుల సత్యనారాయణ ఎంపిక చేశారన్నారు. మార్ని జానక రామచౌదరి రచించిన 'వనాలే మన జీవనగమనాలు' అనే కవితకు ప్రథమ బహుమతి లభించింది. దంతినాడ అచ్యుతనారాయణ రాసిన విన్నపం కవితకు ద్వితీయ బహుమతి, కాకర్ల రమణయ్య రాసిన ప్లాస్టిక్ రహిత పర్యావరణం కవితకు తృతీయ బహుమతి లభించిందన్నారు. బొకేలు తయారు, రూఫ్‌టాప్‌గార్డెన్, కిచెన్‌గార్డెన్, ఆర్నమెంటల్‌గార్డెన్ పోటీల్లో విజేతలకు బహుమతులిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, అధ్యక్షుడు హుస్సేన్, కవి మధునాపంతుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ



విద్యార్థులకు కిట్లను అందజేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్



విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న నాయకులు

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీ 15వ వార్డులోని శ్రీగోపాల కృష్ణ గోఖలే మున్సిపల్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను సోమవారం పంపిణీ చేశారు. తరగతికి అయిదుగురి విద్యార్థుల చొప్పున అయిదు తరగతులకు 25 కిట్లను అందించారు. ఒక్కో కిట్‌లో స్కూల్ బ్యాగ్, మూడు జతల యూనిఫాంలు, పాఠ్య, నోటు పుస్తకాలు, బూట్లు, రెండు జతల షాక్స్‌లు, బెల్టు, నిఘంటువు ఉంటాయని కలెక్టర్ చెప్పారు. ఈ కిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటూ మెరుగైన విద్యా ప్రమాణాలతో ప్రతి తరగతిలోనూ ఉత్తీర్ణులై ఉత్తమంగా ఎదగాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఆకాంక్షించారు. మన బడి–మన భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రాంగణంలో చేపట్టిన అభివృద్ధి పనులను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో డీఈవో డాక్టర్ షేక్ సలీమ్ బాషా, సర్వ శిక్ష ఏపీసీ జి.మమ్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

తాళ్లరేవు: పి.మల్లవరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు సోమవారం పుస్తకాలను అందజేశారు. స్థానిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుమారు 300 మంది విద్యార్థులకు కిట్లలో భాగంగా పుస్తకాలు, యూనిఫాంలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పంపన రామకృష్ణ, వైస్ ఎంపీపీ డి.నాగేంద్రప్రసాద్, నాయకులు ఉంగరాల వెంకటేశ్వరరావు, గుత్తుల వెంకటరమణ, డి.సుబ్బారావు, ఉపాధ్యాయులు మొండి వీరబాబు, వెంకటేశ్వరరావు, శివకుమారి, పీఈటీ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

300 మందికి కంటి వైద్య పరీక్షలు



శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవులో క్రీమ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక సంతపేట సెంటర్‌లోని బాప్టిస్టు మందిరంలో క్రీమ్ సేవా సంస్థ డైరెక్టర్ దొమ్మేటి వసంత రావు, తాళ్లరేవు జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 300 మందికి పరీక్షలు నిర్వహించారు. పిఠాపురం సీఎంసీ ఆస్పత్రి వైద్యులు అమృత్‌లాల్ వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన 61 మందిని పిఠాపురం సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా శామ్యూల్ సాగర్ మాట్లాడుతూ తీర ప్రాంత గ్రామాల్లో కంటి సమస్యలు అధికంగా ఉండడంతో పాటు వృద్ధుల సౌకర్యార్థం ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా సుమారు 100 మందికి షుగర్ పరీక్షలు కూడా నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిట్టూరి చలపతి, నడింపల్లి వినోద్, బొంతు మోహన్, సతీష్‌రాజు, పొన్నాడ పేరయ్యరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పంట కాలువల కాలుష్యంపై ఫిర్యాదు

అమలాపురం రూరల్: అల్లవరం మండలం దేవగుప్తం, గుండెపూడి గ్రామాల మీదుగా వెళ్లే పంట కాలువ సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలతో కలుషితమవుతోందని, అంతేకాకుండా ఆక్రమణలకు గురి అవుతోందని రైతులు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఆక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆయా గ్రామాల రైతులు గుంటూరి బాలరాజు, వేగిరాజు వెంకటరాజు, సాధనాల వెంకట్రావు, మాకే కష్ణమూర్తి, పినిపే ప్రకాష్ తదితరులు కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

రేపు కైట్‌లో అవగాహన సదస్సు

తాళ్లరేవు: కోరంగి కై ట్ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం అమలాపురంలో ఎంసెట్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు కైట్ డైరెక్టర్ వై.సత్తిరాజు, ప్రిన్సిపాల్ వై.రామకృష్ణలు ఒక ప్రకటనలో తెలిపారు. అమలాపురం ముమ్మిడివరం గేట్ దగ్గర గల శుభగృహ హోటల్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించే సదస్సుకు జేఎన్‌టీయూకే మాజీ వైస్ చాన్సలర్ డా.కేవీఎస్‌జీ మురళీకృష్ణ, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు ప్రతీప్ కొండిపర్తి హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఇంజినీరింగ్ అవకాశాలు, గేట్, ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు, ఇంజినీరింగ్ కళాశాల ఎంపికలో తీసుకోవాల్సిన ముఖ్య విషయాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆరోగ్య సంరక్షణ, వైద్య విద్యకు గమ్యస్థానం పుదుచ్చేరి



జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్

యానాం: ఆరోగ్య సంరక్షణ, వైద్యవిద్యకు గమ్యస్థానంగా పుదుచ్చేరి క్రమంగా అభివృద్ధి చెందుతుందని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ పేర్కొన్నారు. సోమవారం పుదుచ్చేరి జిప్‌మెర్‌లో ఏపీజే అబ్దుల్‌కలామ్ ఆడిటోరియంలో దేశ నిర్మాణంలో పర్యావరణ స్థిరత్వం అనే అంశంపై అధ్యాపకులు, వైద్య విద్యార్థుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎల్జీ కె.కైలాషనాథన్ మాట్లాడుతూ చిన్నదిగా ప్రారంభమైన జిప్‌మెర్ వైద్యవిద్యాసంస్థ అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన వైద్యసంస్థగా గుర్తింపు పొందిందని ఇది పుదుచ్చేరికి గర్వకారణమన్నారు. ప్రజారోగ్యం, మానవత్వం పట్ల జిప్‌మెర్ నిబద్ధత ద్వారా పుదుచ్చేరి పక్కనే ఉన్న తమళనాడు ఇతర దక్షిణాధి రాష్ట్రాల సామాన్యప్రజల ఆశాజ్యోతి అని పేర్కొన్నారు. పర్యావరణ స్థిరత్వానికి అధ్యాపకులు రాయబారులుగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఎం రంగసామి, హోంమంత్రి నమశ్శివాయం, ఎంపీ వైథిలింగం, రాజ్యసభసభ్యుడు సెల్వగణపతి, జిప్‌మెర్ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చెడీ తాలింఖానా వేసవి శిక్షణ



ఔత్సాహికులకు ధ్రువీకరణ, ప్రశంసా పత్రాలు అందిస్తున్న ప్రముఖులు

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన చెడీ తాలింఖానా (కర్ర సాము) నిపుణుడు వంటెద్దు సత్తిబాబు 'శ్రీ కోనసీమ యుద్ధ కళా కేంద్ర' అనే శిక్షణా సంస్థను స్థాపించి 45 రోజులపాటు నిర్వహించిన ఉచిత వేసవి శిక్షణా శిబిరంలో 52 మంది చిన్నారులకు వీర విద్యకు శిక్షణనిచ్చారు. అమలాపురం గండువీధిలోని కాపు కల్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన ఈ శిక్షణ సోమవారంతో ముగిసింది. అమలాపురం దసరా ఉత్సవాల్లో చెడీ తాలింఖానా ప్రదర్శనలకు రాష్ట్ర వ్యాప్త ఖ్యాతి ఉన్న క్రమంలో ఆ వీర విద్యపై చిన్నారులకు శిక్షణ ఇవ్వాలని సత్తిబాబు భావించి, ఈ వేసవి శిక్షణను ఇచ్చారు. ఇందుకు పట్టణానికి చెందిన పార్టీలకు అతీతంగా ప్రముఖులు అతనిని అభినందించారు. 12 ఏళ్ల లోపు బాల బాలికలు ఉత్సాహంగా శిక్షణకు వచ్చి వీర విద్యను నేర్చుకున్నారు. శిక్షణ పొందిన చిన్నారులకు పట్టణ ప్రముఖులు ధ్రువీకరణ పత్రాలు, ప్రశంసా పత్రాలు అందించారు. అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ చిక్కాల గణేష్, బీవీసీ ఇంజినీరింగ్ విద్యా సంస్థల చైర్మన్ బోనం కృష్ణ సతీష్, పట్టణ ప్రముఖులు మెట్ల రమణబాబు, వంటెద్దు వెంకన్నాయుడు, తిక్కిరెడ్డి నేతాజీ, నల్లా శ్రీధర్, ఆర్డీఎస్ ప్రసాద్, నల్లా అజయ్, ఆశెట్టి ఆదిబాబు, వంటెద్దు బాబి తదితరులు చెడీ తాలింఖానా తర్ఫీదు పొందిన ఔత్సాహికులకు ధ్రువీకరణ, ప్రశంసా పత్రాలు అందించారు.

అతిసార వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్



కలెక్టరేట్‌లో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: అతిసార వ్యాధి (డయేరియా)పై వైద్య శాఖ అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అతిసార వ్యాధిపై ముద్రించిన ప్రచార కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న రెండు నెలల పాటు పల్లెల్లో మురికివాడల్లో స్టాప్ డయేరియా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. స్టాప్ డయేరియా క్యాంపెయిన్ సందర్భంగా జూన్ నుంచి జూలై 31 వరకు రెండు నెలల పాటు జిల్లా వ్యాప్తం నిర్వహించాలన్నారు. దీనిలో భాగంగా ఈనెల 16 నుంచి ప్రతి ఇంటికి రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, 14 జింక్ మాత్రలు అందించాలన్నారు. అదే విధంగా ప్రతి పీహెచ్‌సీ హెల్త్ సెంటర్లు అంగన్‌వాడీ కేంద్రాలు జిల్లాలో 2,456 వరకు ఉన్నాయని వీటిలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఎం అండ్ హెచ్ఓ సీహెచ్‌వో భరత లక్ష్మి, జిల్లా ఇమ్యూని కేషన్ అధికారి బీవీవీ సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి ఇంటి పట్టా అందజేత

అమలాపురం రూరల్: పట్టణంలో గొల్లగూడెంకి చెందిన రాజులపూడి ఆరుద్ర కుమార్తె సాయిలక్ష్మీచంద్ర గతంలో జరిగిన ఆస్తి తగాదాల మూలంగా స్పైనల్ కార్డ్ (వెన్నెముక) దెబ్బతిని చక్రాల కుర్చీకే పరిమితమయ్యారు. దివ్యాంగరాలైన సాయి లక్ష్మీ చంద్రకు కామనగరువులో 72 గజాల స్థలం పట్టాను జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సోమవారం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో తన వాళ్ల బంధువులతో జరిగిన తగాదాలు మూలంగా సాయిలక్ష్మీచంద్ర దివ్యాంగురాలిగా మారిందని, ఈ ఏడాది మే 31న కాట్రేనికోన మండలం గ్రామానికి వచ్చిన సీఎం చంద్రబాబు ఈ విషయం తెలుసుకొని ఈ అమ్మాయికి ఉద్యోగం, ఇల్లు మంజూరు చేయాలని ఆదేశించారన్నారు. ఆ మేరకు ఇంటి పట్టాను అందించామన్నారు. త్వరలో ఉద్యోగం కూడా ఇప్పిస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో రాజకుమారి, తహసీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్, వీఆర్వోలు పాల్గొన్నారు.